
# చీమాయణం

నిశాపతి




ఆ హడావిడింతా కొత్త ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు(ఈఈ) రాకను గురించి. ఆ రోజు అతను ఆ పని మీదికి తనిఖీ చేయడానికి మొదటిసారిగా వస్తున్నాడు. అతను కుర్రాడు. డైరెక్ట్ రిక్రూటీ. చేరి కొద్దిరోజులే అయినా చాలా ముక్కుసూటిగా పోతాడని అప్పుడే డిపార్ట్‌మెంట్‌లో చెడ్డపేరు తెచ్చుకున్నాడు.

పని వాళ్లంతా ఉత్సాహం తెచ్చిపెట్టుకుని పనిచేస్తున్నారు. తను చాలా 'సిన్సియర్' అని ఈఈగారి దగ్గర ఇంప్రెషన్ కొట్టేయ్యాలని పనివాళ్లకి ఆ రోజు ఎలా ప్రవర్తించాలో బాగా తర్ఫీదు ఇచ్చాడు కంట్రాక్టరు. ఆ ఇంప్రెషన్ ముందు ముందు చాలా ఉపయోగపడుతుందని అతనికి తెలుసు.

దూరంగా ఎక్కడో జీపు హారన్ వినిపించింది. అందరూ ఒక్కసారిగా 'ఎలర్ట్' అయ్యారు గవర్నమెంటు జీపు లొడ లొడ శబ్దం దగ్గరయ్యే కొద్దీ వాళ్లలో టెన్షన్ పెరిగిపోతోంది.

ఎలాగైతేనేం చివరికి ఈఈ గారు విచ్చేశారు. జూనియర్ ఇంజినీర్ (జేఈ– అతన్ని ఇప్పుడు ఏఈఈ అంటున్నారు) కుడిచెయ్యి పైకెత్తి నమస్కరించాడు. అతని కన్నా పైవాడూ, ఈఈ కన్నా కింది వాడు అయిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డిఈఈ) కొంచెం వంగి ఒంటి చేత్తోనే నమస్కరించాడు. కంట్రాక్టరు చిరునవ్వుతో రెండు చేతులూ జోడించాడు. ఈఈ




గారి జవానూ, డ్రైవరూ ఈఈ పట్ల వినయం ప్రదర్శిస్తున్నట్లుగా బాగా వెనగ్గా నడుస్తున్నారు. ఈఈ చూడకుండా కంట్రాక్టరు దగ్గరా, ఆఫీసర్ల దగ్గరా మామూళ్లు వసూలు చేసుకుందామని.

అదో చెరువు కట్టపని. మట్టిని తెచ్చిపొయ్యడం, దాన్ని రోలర్లతో దిమ్మిసా చెయ్యడం, తరువాత నీట్‌గా కొలతల ప్రకారం వచ్చేలా కట్టని 'సెక్షనింగ్' చెయ్యడం. అంతా పద్ధతి ప్రకారమే జరుగుతున్నాయి. ఈఈ మెచ్చుకోలుగా తల వూపబోయి, మళ్లీ ఇది తన మొదటి 'విజిట్' అని గుర్తొచ్చి గంభీరమైపోయ్యాడు. 'మొదటి' విజిట్లో కాస్త హడల్ గొడితేగాని వీళ్లకి తనంటే భయం వుండదు అనుకున్నాడు. అందుకే కట్టంతా భూతద్దాల కళ్లతో 'మైక్రోస్కోపిక్' చూపుతో పరిశీలిస్తున్నాడు.

హఠాత్తుగా ఈఈ ఆగిపోయాడు. కంట్రాక్టరూ, ఆఫీసర్లూ గూడా అప్రయత్నంగా 'ఫ్రీజ్' అయిపొయ్యారు. ఈఈ కొన్ని క్షణాలు కట్టకేసి తీక్షణంగా దృష్టి మరల్చకుండా చూశాడు. తర్వాత వెనక్కి డీఈఈతో మీకేమైనా కనిపిస్తోందా ఇక్కడ? అన్నాడు. డీఈఈకి ఏమీ కనిపించలేదు. ఈఈ దేన్ని ఉద్దేశిస్తున్నాడో అర్థం కాక మౌనంగా వుండిపోయాడు.

మళ్లీ ఈఈయే అందుకొని, "ఈ కట్ట ఏ స్పెసిఫికేషన్ ప్రకారం వేస్తున్నారు?" అన్నాడు.

డీఈఈ వూపిరి పీల్చుకున్నాడు. 'ఏపీడియస్‌యస్'లో స్పెసిపికేషన్లన్నీ అతనికి కంఠస్థమే! ఎటొచ్చీ డిజైన్లంటేనే కొంచెం గొంతుపట్టు కుంటుంది. అతను ఓవర్సీర్ కోర్సు లాంటిది చదివి, తర్వాత డిప్లొమో సంపాదించి క్రమంగా ప్రమోషన్ల మీద డిఈఈ అయ్యాడు. ఇంకా కొద్ది సంవత్సరాల్లో రిటైరవబోతూ ...తను బాగా ప్రిపేర్ అయిన ప్రశ్న పరీక్షలో వచ్చిన వచ్చిన విద్యార్థిలా ఆనందిస్తూ"స్పెసిఫికేషన్ నెంబర్ 20-ఎ" అన్నాడు.

"ఆ క్లాజ్ ఏం చెబుతోంది?"

"కట్ట నిర్మించే స్థలంలో వున్న గడ్డీ, కంపా, పొదలు, మొక్కలూ అన్నీ కాంట్రాక్టరు స్వంత ఖర్చు మీదే తీసెయ్యాలి. సెక్షనింగ్ గూడా అతను స్వంత ఖర్చుతోనే చెయ్యాలి. మేం అలాగే ఫాలో అవుతున్నాం సార్. ఆ ఐటమ్స్‌కి మేం బిల్లు చెయ్యడం లేదు సార్" అన్నాడు గుక్కతిప్పుకోకుండా డీఈఈ.

"ఆ సెక్షన్ చీమల పుట్టల గురించి ఏం చెబుతోంది?"

"ఓ అదా సార్. ఇక్కడ సార్, చీమల పుట్టలేమీ లేవు సార్. అసలు గట్టి నేలల్లో చీమల పుట్టలుండవుసార్" అన్నాడు డీఈఈ.

ఈఈ కఠినంగా చూస్తూ, 'అడిగిన దానికి సమాధానం చెప్పడం నేర్చుకోండి. నాకు పాఠాలు చెప్పొద్దు. చీమల పుట్టలు వున్నాయా లేవా? యస్ ఆర్ నో' అంటూ ప్రశ్నార్థకంగా జేఈ వైపు తిరిగాడు.

జేఈఈ అవకాశం వృథా చేసుకోదల్చుకోలేదు. అతను బిటెక్ పాసయిన కుర్రాడు. అంచెలంచెలుగా పైకొచ్చిన డిప్లొమా హోల్డర్ దగ్గర పనిచేయడమే పెద్ద నామోషీ అని అతనుప్పుడూ అనుకుంటూ వుంటాడు. ఇన్నాళ్లకి అవకాశం దొరికింది.

"చీమల పుట్టలు ఇంచుమించులేనట్లే సార్. ఒకటో రెండో వుంటే అవి కంట్రాక్టరు ఖర్చుతోనే తీసేయించాం" అన్నాడు డీఈఈ అబద్ధాన్ని బయటపెడుతూ...

అయితే ఈఈకి జేఈ అంటే ముద్దం లేదు. అతని వైపు తీక్షణంగా చూస్తూ, "ఒకటో రెండోనా? అంటే కచ్చితంగా ఎన్ని తీసేసిందీ తెలీకుండానే పని చేస్తున్నారన్నమాట. సరే, ఓకే, అని పూర్తిగా నిర్మూలించినట్లు ఎట్లా నిర్ధారణ చేసుకున్నారు? అన్నాడు మళీ జేఈ వైపు తిరిగి.

ఇద్దరూ మాట్లాడలేదు.

ఈఈయే మళ్లీ అందుకని "Ant hills are to be completely dug out and queen ant drstroyed before the earth work is started" (పని మొదలుపెట్టే ముందు చీమల పుట్టలన్నీ తవ్వేసి, రాణి చీమని చంపేయాలి అని లేదా ఆ పేరాలో. మరి మీరు రాణీ చీమను చంపేశారా? అని అడిగాడు)

జేఈఈకి డీఈఈకి నోట మాట రాలేదు. ఈ ఈకి లోపల్లోపల సంతోషం తన్నుకొస్తోంది. రాత్రే ఎందుకో 'ఏపీడీయస్సెస్' తిరగేశాడు. అందులో ఈ రాణి చీమ వ్యవహారం ఒక్కటే తనుకి గుర్తుండిపోయింది. అదే ఇప్పుడు అక్కరకొచ్చింది.

"కచ్చితంగా మీరు రాణీ చీమను చంపలేదు. చంపితే అది ఇప్పుడు నా కళ్ల ముందు ఎలా ప్రత్యక్షమవుతుంది?" అన్నాడు ఈఈ మళ్లీ.

అప్పుడు చూశారు అందరూ- ఈఈ గారి దృష్టి ఇందాకటి నించీ దేని మీద వుందో! కట్టమీద ఓ చీమ పాకుతోంది!

జేఈకి, డీఈఈకీ ఏం చేయాలో తోచలేదు. వాళ్లు పాపం ఇంజనీరింగ్ అంటే అంతో ఇంతో చదువుకున్నారు కానీ, 'క్రిమి శాస్త్ర పరిజ్ఞానం'బొత్తిగా లేదాయె! పక్కన మందీ మార్బలం లేకుండా వస్తే ముఖ్యమంత్రినీ గుర్తుపట్టలేం. 'ఎవరో అచ్చం ముఖ్యమంత్రిలాగే వున్నాడు అనుకుంటాం. అలాంటిది ఈ వెధవ చీమని ఎలా గుర్తించడం దానికి కిరీటమా. పాడా?!

హఠాత్తుగా తెలివి తెచ్చుకున్నట్లు, జేఈఈ కాలు పైకెత్తి, ఆ చీమని చంపబోయాడు.

ఈఈ కంగారుగా, "ఏయ్, ఏంటి మీరు చేస్తున్న పని? ఇప్పుడు మీరు దాన్ని చంపినంత మాత్రాన సరిపోతుందా? అది ఈ పాటికే బండిని ఎన్ డేంజర్ చేసి వుంటుంది. అది సరే, ఇప్పుడు మీరు చేయబోయిన పని దేని కిందికి వస్తుందో తెలుసా?" అన్నాడు.

డీఈఈ తలవంచుకున్నాడు.

"మీరు ఎన్నేళ్ల సర్వీస్ పుటప్ చేశారు?" హఠాత్తుగా అడిగాడు ఈఈ

డీఈఈ మాట్లాడలేదు.

"కంట్రాక్టరు తన విధి సక్రమంగా నిర్వహించ

లేదు. అప్పుడు మీరు చూస్తూ వూరుకున్నారు. ఇప్పుడు అతను చెయ్యవలసిన పని మీరు చేస్తా నంటున్నారు. అంటే ఏమిటన్నమాట?''

''..........''

''తెలీదా?! సరే తెలుసుకోండి. అది కాంట్రాక్ట రుకి అక్రమ సహాయం అనగా 'అనాథరైజ్‌డ్ ఎయిడ్' కిందకి వస్తుంది.''

''అలా అయితే దాన్ని నేను చంపనా సర్?'' అన్నాడు కంట్రాక్టరు.

ఈఈ అతని వైపు తిరిగి ''అంత మాత్రాన మీరు మొదట చేసిన తప్పు 'బ్రీచ్ ఆఫ్ కాంట్రాక్ట్'రద్దయి పోతుందా? మీరు స్పెసిఫికేషన్ల పుస్తకం మీద సంతకం పెట్టలేదా?'' అన్నాడు.

కాంట్రాక్టర్‌కి తన తొలి రోజులు గుర్తొచ్చాయి. తను కొత్తగా 'రిజిష్టరు' అయినప్పుడు ఏదో ఇంత లావు బుక్కు చివరి పేజీలో వున్న తెల్ల కాగితం మీద సంతకం పెట్టాడు. అప్పటికే ఆ పేజీ యాత్రా స్థలాల్లో గోడల్లా చీమ తలకాయంత సందు గూడా లేకుండా సంతకాల్తో నిండిపోయింది. ఆ పుస్తకమే 'ఏపీడీయస్‌యస్' అని కూడా అతనికప్పుడు తెలీదు.

''ఓకే! మళ్లీ నేను ఆదేశాలు ఇచ్చేదాకా పని ఆపు చెయ్యండి. ఆ చీమని ఒక ఖాళీ అగ్గిపెట్టెలో పెట్టి నా కివ్వండి. నేను చెప్పేదాకా బిల్లు పంపొద్దు'' అని చెప్పి ఈఈ వెళ్లిపోయాడు.

''ఉరిమి ఉరిమి మంగలం మీద పడ్డట్లు మధ్య తన బిల్లుకి తిప్పలొచ్చాయి.'' అనుకున్నాడు కంట్రాక్టరు.

అతనికి ఒళ్లు మండింది. ప్రతిపక్ష ఎమ్మెల్యే అయిన తన బావమరిదితో అసెంబ్లీలో ప్రశ్న వేయించాడు. దాన్ని ఎల్లేక్యూ అంటారు.

ఎల్లేక్యూ రాగానే విషయం చీఫ్ ఇంజనీర్(డిపార్ట్‌మెంట్ హెడ్) దాకా వెళ్లింది. సంగతంతా కనుక్కుని ఆయన ఈఈని బాగా తిట్టాడు. అవి ఈఈ స్థాయి వాళ్లని తిట్టే తిట్లు కావు.

''ఇంతకీ, ఆ చీమని ఎక్కడ తగలేశావ్?'' అన్నాడు చివరికి.

''సారీ సర్! దాన్ని జాగ్రత్త చెయ్యమని మా మేనేజర్ కిచ్చాను. అతను అటెండరుకి ఇచ్చినట్లున్నాడు. అతను దాన్ని 'ఫుడ్ ఫర్ వర్క్' బియ్యం బస్తాలున్న గోదాంలో ఒక ర్యాక్‌లో పెట్టాడట. ఈ విషయం తెలీని మెయింటెనెన్స్ కంట్రాక్టరు ఆ గోడౌన్లలో గెమాక్సిన్ కొట్టించాడు సార్'' అన్నాడు ఈఈ దీనంగా

''ఇంతకీ అది చచ్చిందంటావ్! మీ డివిజన్ ఆఫీసులో ఏం జరుగుతుందో నీకు తెలీదు. పైగా వెధవ మతిలేని పన్లూ, నీవూను...'' అంటూ మరి రెండు తిట్లు తిట్టి ఫోన్ పెట్టేశాడు. ఫోన్ పెట్టే ముందు బిల్లు వెంటనే 'పే' చెయ్యండని చెప్పాడు.

ఆ మర్నాడు ఈ విధంగా ఎల్లేక్యూకి సమాధానం తయారు చేశాడు. సీఈ దాన్ని మంత్రి అసెంబ్లీలో చదివాడు.

ప్రశ్న : ఫలానా వర్క్ తాలూకూ కంట్రాక్టర్ రాణీ చీమను చంపలేదన్న వంకతో అతని బిల్లు ఆపిన మాట యదార్థమేనా? అతను ప్రతిపక్ష ఎమ్మెల్యే కావడం దానికి నిజమైన కారణం కాదా?

జవాబు : అతని వద్ద నుండి తన చర్య వల్ల డిపార్ట్‌మెంట్‌కు కలగబోయే అన్ని నష్టాలకీ తనే బాధ్యుడిననీ, ఆ రాణీ చీమ వల్ల గానీ, దాని వారసుల, నామినీల వల్ల కానీ కలగబోయే అన్ని కష్టాలకీ నష్టాలకీ తనే జవాబుదారీ వహిస్తాననీ, ఐ-బాండ్ తీసుకొని అతని బిల్లు పాసు చేశాం. కనుక ఈ ప్రశ్నలో ప్రస్తావించిన ఇతర అంశాలు తలెత్తవు.

ప్రశ్న : మా నాయకురాలు ఇందిరాగాంధీ రాజభరణాలు రద్దు చేశాక మనుషుల్లోనే రాజులు, రాణీలు అందరూ నశిస్తే ఇంకా చీమల్లో రాణులేమిటి? ఈ అప్రజాస్వామిక వర్గీకరణ రద్దు చేయడానికి చర్యలేమైనా తీసుకున్నారా?

జవాబు : ఆ విషయం 'బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్'కి పంపించాం. వారి నివేదిక వచ్చాక చర్య తీసుకుంటాం.

ప్రశ్న : ఇలా అర్థం లేని కారణాలతో బిల్లు ఆపిన ఆఫీసర్లపై ఏమి చర్య తీసుకున్నారు?

జవాబు : బిల్లు పే చేశాం కనుక పై ప్రశ్న ఉత్పన్నం కాదు.

★

